సాక్షి అనంతపురం

గురువారం । 31 । ఆగస్టు । 2023



టన్ను చీనీ రూ. 20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు పలికాయి.



స్కోచ్ అవార్డుకు జీఆర్పీ

రైళ్లు, స్టేషన్ల పరిసరాల్లో నేరాలు, చోరీలు తగ్గుముఖం పట్టడంతో ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డు గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్పీని వరించింది.

8లో

గరిష్టం/కనిష్టం

38.3°/23.1°

జిల్లా అంతటా బుధవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం తగ్గింది. ఉక్కపోత పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

డీఈఓ సాయిరామ్ రేపు డిశ్చార్జ్



రాప్తాడురూరల్: ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై బెంగళూరులోని ఆస్టర్ సీఎంఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డీఈఓ ఎం.సాయిరామ్ శుక్రవారం డిశ్చార్జ్ కానున్నారు. ఆరోగ్యపరంగా ఇప్పటికి ఆయన కోలుకున్నా...పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కొన్ని నెలల సమయం పడుతుందని వైద్యులు తెలిపారు. ఐసీయూ నుంచి ప్రత్యేక గదికి మంగళవారం షిఫ్ట్ చేశారు. కుడివైపు కాలు, చేయి స్పందించడం లేదు. దీంతో రెండు రోజులుగా ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారు. సంగీతంపై ఆసక్తి ఉన్న సాయిరామ్ సెల్‌ఫోన్‌లో పాటలు పెడితే పాడేందుకు ప్రయత్నిస్తున్నారని సతీమణి ఉమా తెలిపారు. అనంతపురంలోని నివాసంలో రెండురోజుల పాటు ఉండి అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్తామని ఆమె వెల్లడించారు. ఇక్కడ కొంతకాలమే పని చేసినా ఎప్పటికీ గుర్తుండిపోయేలా ప్రేమానురాగాలు చూపించిన జిల్లా వాసులకు రెండు చేతులెత్తి నమస్కరిస్తున్నట్లు తెలిపారు.

సబ్ జూనియర్ ఫుట్‌బాల్ టోర్నీ విజేత 'అనంత'



అనంతపురం సబ్ జూనియర్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్

అనంతపురం: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (ఏపీఎఫ్ఏ) అంతర జిల్లాల ఫుట్‌బాల్ బాలుర టోర్నమెంట్‌లో అనంతపురం జిల్లా విజేతగా నిలిచింది. విజయవాడలో ఈ నెల 29 నుంచి 30 వరకు జరిగిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో అనంతపురం జిల్లా సబ్ జూనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. 2–1 తో ఏలూరు జిల్లాను, 6–0 తో కాకినాడ జట్టును ఓడించి గ్రూప్ నుంచి మొదటి స్థానంలో నిలిచింది. తిరుపతి జిల్లాపై 4–0 తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. శ్రీసత్యసాయి జిల్లాపై అనంతపురం జట్టు 1–0 తేడాతో ఫైనల్‌లో విజయం సాధించింది. ఏలూరు ఎంపీ, ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ అనంతపురం జట్టుకు విన్నర్స్ ట్రోఫీని అందజేశారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ దేవి

గార్లదిన్నె: ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)ల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్ఓ ఈబీ దేవి ఆదేశించారు. బుధవారం గార్లదిన్నె పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. ఇక్కడ జరుగుతున్న ప్రసవాలు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి రోగులకు వైద్య సేవలందించాలన్నారు. సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు నిర్వహించే రెండో విడత 'మిషన్ ఇంద్ర ధనుస్సు' కార్యక్రమానికి సంబంధించి ఆశావర్కర్లు పక్కాగా సర్వే చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అధికారి డాక్టర్ సుజాత, పీహెచ్‌సీ వైద్యాధికారులు షమీన్‌తాజ్, గౌతమి, హనీషా, దిలీప్ కుమార్ సీహెచ్ఓ లోక్‌నాథ్ పాల్గొన్నారు.

హెచ్ఐవీ నియంత్రణకు కృషి

అనంతపురం క్రైం: అవగాహన ద్వారా హెచ్ఐవీ/ ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలని డీఎంహెచ్ఓ దేవి పేర్కొన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రోగ్రాం ఆఫీసర్లతో ఆమె సమావేశమయ్యారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి పీడీ ఆదేశాల మేరకు జిల్లాలోని యువతకు సెప్టెంబర్ 8న జిల్లాస్థాయి మారథాన్ పోటీలు, 15న డ్రామా పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ ఈ నెల 13న జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలలోని 8, 9 తరగతుల విద్యార్థులు క్విజ్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, జిల్లాస్థాయి కమిటీ సభ్యులు ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శశాంక్‌మౌళి, రెడ్ రిబ్బన్ క్లబ్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ గిరిధర్, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ రంగనాథ్, జిల్లా స్పోర్ట్స్ అధికారి నరసింహారెడ్డి, యువజన సర్వీసుల శాఖ నుంచి సునీల్‌కుమార్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్ర శ్రీనివాసులు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం జీవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ భాగ్యం

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖర్చుకు వెనకాడకుండా లబ్ధిదారుల సంక్షేమం కోసం పాటుపడుతున్నారు. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూరుస్తున్నారు. ప్రభుత్వం తరఫున పేదలకు అందిస్తున్న సాయం దేశంలో ఎక్కడా ఈ స్థాయిలో లేదు. వివిధ కేటగిరీల కింద రూ.2,750 నుంచి రూ.10వేల వరకు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం గమనార్హం.

- రేపటి నుంచి పింఛన్ల పండుగ
- కొత్తగా 7,312 మందికి మంజూరు
- పేదల విషయంలో ఖర్చుకు వెనకాడని జగన్ సర్కారు



అనంతపురంలో పింఛన్‌దారుల సంబరాలు (ఫైల్)

అనంతపురం: జిల్లాలో కొత్తగా మరికొంతమంది పింఛన్ల జాబితాలో చేరారు. వారికి సంబంధించి పింఛన్ నిధులను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కొత్త పెన్షన్‌దారులకు వలంటీర్లు నగదు అందజేయనున్నారు. జిల్లాలో కొత్తగా 7,312 మంది పింఛన్‌కు అర్హత సాధించారు. 2,72,832 మందికి పింఛన్లు అందుతున్నాయి. తాజా కొత్త పింఛన్లతో ఆ సంఖ్య 2,80,144కు చేరింది. ఈ మేరకు సెప్టెంబర్ నెలకు సంబంధించి రూ.78.05 కోట్ల సొమ్మును అందించనున్నారు. వైఎస్సార్ పింఛన్ కానుక కింద వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, కళాకారులు, చర్మకారులు, చేనేత కార్మికులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితరులు లబ్ధి పొందుతున్న విషయం విదితమే.

పేదల పక్షపాతి సీఎం జగన్

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పేదల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తున్నారు. ఎన్నికల ముందు చెప్పిన దానికంటే ఎక్కువగా మేలు చేస్తున్నారు. కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో పథకాలను అమలు చేస్తున్నారు. నాలుగేళ్లలోనే దేశంలో మరే రాష్ట్రంలోనూ జరగని విధంగా ఏకంగా పేదలు రూ.2 లక్షల కోట్లకు పైగా సొమ్ము లబ్ధి పొందారు.

నాటి అవస్థలు మరువగలమా..?

టీడీపీ హయాంలో పెన్షన్ పొందాలంటే అవస్థలు పడాల్సి వచ్చేది. అప్పట్లో పంచాయతీ కార్యాలయం వద్దనో, గ్రామంలోని టీడీపీ పెద్ద ఇంటి వద్దనో అధికారులు పింఛన్లు పంపిణీ చేసేవారు. పింఛన్ కోసం అక్కడికెళ్లిన వృద్ధులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఉండేది. ఇక.. కొత్తగా పెన్షన్ మంజూరు కావాలంటే సరేసరి. జన్మభూమి కమిటీల చుట్టూ వారమో, నెలనో తిరిగితే, అదీ లంచం ముట్టజెబితే తప్ప మంజూరు కాని పరిస్థితి.

నేడు ఠంచన్‌గా పింఛన్..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏడాదికి రెండుసార్లు పింఛన్ల సంఖ్య పెంచుకుంటూ పోతున్నారు. టీడీపీ హయాంలో పెన్షన్ పొందేవారి బాధలు ప్రత్యక్షంగా చూసిన వైఎస్ జగన్.. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర పెన్షన్‌దారులు కష్టం కలిగించకుండా ఇంటి వద్దనే డబ్బు అందించాలనే లక్ష్యంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. ప్రతి 50 ఇళ్లకూ వలంటీర్‌ను నియమించి నెలా ఒకటో తేదీ తెల్లవారుజాము నుంచే పింఛన్ మొత్తాన్ని ప్రతి ఇంటికీ తీసుకెళ్లి అందించేలా చర్యలు తీసుకున్నారు. లబ్ధిదారులు పొలాల్లో ఉన్నా, ఆస్పత్రుల్లో ఉన్నా, చికిత్స అనంతరం ఎక్కడ విశ్రాంతి తీసుకుంటున్నా వారి వద్దకే వెళ్లి పింఛన్ అందజేసి వలంటీర్లు సంతోషం పంచుతుండడం గమనార్హం.

ఎప్పటికప్పుడు అర్హుల గుర్తింపు



ఒక నెలలో అర్హులను గుర్తించి వదిలేయకుండా ప్రతి నెలా గుర్తించి సంతృప్త స్థాయిలో వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తున్నాం. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అందజేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. కొత్త పింఛన్లు ఒకటో తేదీనుంచే అందిస్తాం. పింఛన్ కేటగిరీని బట్టి నెలకు రూ.2,750, రూ.3వేలు, రూ.5వేలు, రూ.10 వేల దాకా ఉన్నాయి. మండల స్థాయిలో వెరిఫికేషన్ చేసిన అనంతరమే పారదర్శకంగా కొత్త పింఛన్లు మంజూరు చేశాం.

– ఐ.నరసింహారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

కొత్త పింఛన్ల మంజూరు ఇలా..

మండలం	పింఛన్ల సంఖ్య
అనంతపురం	434
ఆత్మకూరు	128
బెళుగుప్ప	99
బొమ్మనహాళ్	198
బ్రహ్మసముద్రం	152
బుక్కరాయసముద్రం	206
డీ.హీరేహాళ్	149
గార్లదిన్నె	230
గుత్తి	163
గుమ్మఘట్ట	141
గుంతకల్లు	133
కళ్యాణదుర్గం	206
కంబదూరు	240
కణేకల్లు	184
కూడేరు	145
కుందుర్పి	186
నార్పల	238
పామిడి	115
పెద్దపప్పూరు	133
పెద్దవడుగూరు	200
పుట్లూరు	162
రాప్తాడు	195
రాయదుర్గం	153
శెట్టూరు	145
శింగనమల	158
తాడిపత్రి	210
ఉరవకొండ	226
వజ్రకరూరు	235
విడపనకల్లు	189
యాడికి	206
యల్లనూరు	161
అనంతపురం (అర్బన్)	628
గుత్తి (అర్బన్)	115
గుంతకల్లు (అర్బన్)	261
కళ్యాణదుర్గం (అర్బన్)	121
పామిడి (అర్బన్)	73
రాయదుర్గం (అర్బన్)	178
తాడిపత్రి (అర్బన్)	216
మొత్తం	7,312

టెన్త్ ఫెయిలైన విద్యార్థులు 15లోగా ఫీజు చెల్లించాలి

రాప్తాడురూరల్: మార్చి–2024లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే ఫెయిలైన విద్యార్థులు సెప్టెంబరు 15లోగా ఫీజు చెల్లించాలని డీఈఓ వి.నాగరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రూ.50 అపరాధ రుసుంతో సెప్టెంబరు 16 నుంచి 20 వరకు, రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబరు 21 నుంచి 25 వరకు, రూ.500 అపరాధ రుసుంతో సెప్టెంబరు 26 నుంచి 30 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మూడు, ఆపైన సబ్జెక్టులకు రూ.125, మూడులోపు సబ్జెక్టులకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్‌లో మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు.

కౌలు రైతుకూ 'భరోసా'

- 2,518 మంది రైతులకు రూ.1.88 కోట్లు

అనంతపురం అగ్రికల్చర్: తోటి రైతుల నుంచి భూమి కౌలుకు తీసుకుని పంట సాగు చేసే కౌలుదారులకు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు 'రైతు భరోసా' పథకం కింద సాయం అందిస్తోంది. ఆర్‌బీకే వారీగా అలాంటి నిరుపేద కౌలుదారులను గుర్తించి క్రాప్ కల్టివేషన్ రైట్ కార్డు (సీసీఆర్‌సీ) పేరున సాగు హక్కు పత్రాలు అందించే కార్యక్రమం కొనసాగిస్తోంది. సీసీఆర్‌సీ ద్వారా పంట రుణాలు, రైతు భరోసా లాంటి ప్రయోజనాలు వర్తింపజేస్తుండటంతో కౌలుదారులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడత కింద జూన్, జూలైలో ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ కింద 2,89,116 మంది రైతులకు రూ.216.83 కోట్లు జమ చేశారు. తాజాగా కౌలురైతులకు కూడా భరోసా అందిస్తున్నారు. జిల్లాకు సంబంధించి 2,518 మంది రైతులకు రూ.1.88 కోట్లు మంజూరైనట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రెండు మూడు రోజుల్లో సీఎం వైఎస్ జగన్ బటన్ నొక్కి కౌలుదారుల బ్యాంకు ఖాతాల్లోకి భరోసా సొమ్ము జమ చేయనున్నారని తెలిపారు.

4న గూగూడులో చక్కెర వేలం

నార్పల: గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు పీర్లకు చదివించిన చక్కెరను సెప్టెంబర్ నాలుగో తేదీన ఆలయ ప్రాంగణంలో వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శోభ తెలిపారు. ఈ మేరకు ఆమె బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు వేల కిలోల చక్కెరను వేలం ద్వారా విక్రయిస్తామని, వేలంలో పాల్గొనదలచిన వారు రూ.20వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పోలీసే దొంగ!

వీడిన 'దారి దోపిడీ'మిస్టరీ

- ఆ రోజు 2 కార్లలో రూ.3 కోట్ల నగదు తరలింపు
- ఒక కారు ముందుకు వెళ్లిపోగా.. వెనుక కారులో దోపిడీ
- డ్రైవర్ సమాచారంతో పక్కాగా స్కెచ్ వేసిన ఇద్దరు కానిస్టేబుళ్లు
- చాకచక్యంగా రూ.2 కోట్ల నగదు బ్యాగుతో పరారీ
- నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జాతీయ రహదారిలో సినీ ఫక్కీలో జరిగిన రూ.2 కోట్ల దారి దోపిడీ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. దోపిడీకి పథకం వేసింది ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు... ఈనెల 22న ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన రూ.3 కోట్ల నగదును కొందరు రెండు కార్లలో తీసుకుని బెంగళూరు నుంచి హైదరాబాదు బయలు దేరారు. రూ.కోటి నగదు బ్యాగుతో వెళ్తున్న కారు డ్రైవరు.. కడపకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌కు మరొక కారులో తీసుకొస్తున్న రూ.2 కోట్ల నగదు తరలింపుపై సమాచారం చేరవేశాడు. ఎలాగైనా ఆ సొమ్మును దోపిడీ చేయాలని సదరు కానిస్టేబుల్ పథకం వేశాడు. మరో ఇద్దరు వ్యక్తుల(ఒక కానిస్టేబుల్, మరొక వ్యక్తి)తో కలసి పోలీసు దుస్తుల్లో జాతీయ రహదారి–44లోని గార్లదిన్నె మండలం కలగాసిపల్లి వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచే వాహనాల సమాచారం గురించి రూ.కోటితో వస్తున్న కారు డ్రైవర్‌కు ఫోన్ చేసి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వచ్చాడు. అప్పటి వరకు వెనుకగా వస్తున్న సదరు డ్రైవర్ గార్లదిన్నె సమీపంలో రూ.2 కోట్లతో వెళ్తున్న కారును ఓవర్ టేక్ చేసేశాడు. కలగాసిపల్లి వద్ద మాటు వేసిన కానిస్టేబుల్ అండ్‌కోకు సంకేతాలు పంపాడు. నిమిషాల వ్యవధిలో అక్కడికి చేరుకున్న మరొక కారును ఆపి.. తమకందిన సమాచారం, ఆనవాళ్ల ఆధారంగా కారు డిక్కీలో నగదు ఉంచిన బ్యాగును లాగేసుకున్నారు. ప్రశ్నించబోయిన కారులోని వ్యక్తులపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో బాధితులు తమ ముందు వెళ్లిపోయిన రూ.కోటి కారులోని వ్యక్తులకు జరిగిన విషయం తెలియజేశారు. అనంతరం గార్లదిన్నె పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సీసీ ఫుటేజీతో దర్యాప్తు ముందుకు..

రూ.2 కోట్ల నగదుతో ఉడాయించిన వ్యక్తులు ఇన్నోవా వాహనంలో అనంతపురం వచ్చారు. దోపిడీ చేసే కొన్ని గంటల ముందు అనంతపురం వద్ద వాహనం నంబరు ప్లేట్‌కు స్టిక్కర్ అతికించారు. ఈ దృశ్యాలు సీసీ ఫుటేజీలో పోలీసులు పసిగట్టారు. దీంతో చోరీకి తెగబడింది వీరేనన్న కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. స్టిక్కర్ అతికించిన వ్యక్తి జంగిల్ షూ, జంగిల్ ప్యాంట్ ధరించి ఉండటంతో వైఎస్సార్ జిల్లాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్‌గా గుర్తించారు. అనంతరం అతని మొబైల్‌కు వచ్చిన కాల్ డిటైల్స్ పరిశీలించగా.. ఎస్ఆర్ఆర్ కంపెనీకి చెందిన ఓ డ్రైవరు నంబరుతో ఎక్కువగా సంభాషించినట్లు తెలిసింది.

కాల్ డీటైల్స్‌తో దొరికిపోయిన డ్రైవర్..

బెంగళూరు నుంచి రూ.3 కోట్ల నగదుతో హైదరాబాద్‌కు వెళ్తున్న విషయాన్ని ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ నిర్వాహకులు దాచిపెట్టారు. దోపిడీకి గురైన రూ.2 కోట్ల గురించి మాత్రమే పోలీసులకు చెప్పారు. మరో రూ.కోటి ముందు వెళ్లిన కారులో తరలించారని దర్యాప్తులో తేలింది. రూ.కోటిని సురక్షితంగా తీసుకెళ్లిన కారు డ్రైవర్‌ను ఆరా తీయగా... ప్రస్తుతం తాను కళ్లకలక వల్ల డ్యూటీకి వెళ్లడం లేదని బుకాయించాడు. అయితే అతడి సెల్‌ఫోన్ నుంచి వైఎస్సార్ జిల్లా ఏఆర్ కానిస్టేబుల్‌కు కాల్స్ వెళ్లినట్లు తేలడంతో.. అతడిని అదుపులోకి తీసుకున్నాడు. దోపిడీలో పాలుపంచుకున్న మరొక కానిస్టేబుల్, ఇంకొక నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. దోపిడీ అయిన సొమ్ములో కొంతమేర మాత్రమే రికవరీ చేసినట్లు సమాచారం. నిందితుల అరెస్ట్‌కు పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ఇక ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు

- వేగంగా.. పారదర్శకంగా..
- కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో సులువుగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు
- నేటి నుంచి నుంచి అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అమలు



అనంతపురం టౌన్: రిజిస్ట్రేషన్ శాఖ డిజిటలైజేషన్ వైపు వేగంగా పరుగులు తీస్తోంది. ఇందులో భాగంగానే ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వినియోగదారులకు మరింత చేరువ చేసేందుకు ఆన్‌లైన్ విధానానికి శ్రీకారం చుట్టింది. వేగంతో కూడిన సేవలు అందించడంతోపాటు ఆస్తుల బదలాయింపులో అక్రమాలకు తావులేకుండా కచ్చితత్వం ఉండే విధంగా నూతన సాఫ్ట్‌వేర్‌ను రిజిస్ట్రేషన్ శాఖ అనుసంధానం చేస్తోంది.

కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో రిజిస్ట్రేషన్లు

రిజిస్ట్రేషన్ శాఖ కంప్యూటర్ ఎయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్) సాఫ్ట్‌వేర్‌ను మరింత ఆధునీకరించి కార్డ్ ప్రైమ్ 2.0సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా స్థిరాస్తుల లావాదేవీల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయనుంది. దీంతో క్రయ, విక్రయదారులకు సమయం వృథా కాకుండా నిమిషాల వ్యవధిలోనే వేగవంతంగా సేవలు అందుతాయి. ఈ సాఫ్ట్‌వేర్ ప్రత్యేకత ఏంటంటే డాక్యుమెంట్లు కొనుగోలు చేయాల్సిన పనిలేదు. దస్తావేజులను పూరించాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఒక రకంగా చెప్పాలంటే మీ డాక్యుమెంట్లను మీరే ఆన్‌లైన్‌లోనే పూరించి స్లాట్ బుక్ చేసుకోవచ్చు. స్లాట్‌లో సూచించిన సమయానికి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్తే చకచకా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ఫీజు, చలానాలు సైతం ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తే రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా స్థిరాస్తుల క్రయ, విక్రయదారులకు ప్రత్యేకంగా ఓటీపీలు వస్తాయి. అధికారులకు చెబితే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యి డాక్యుమెంట్లు ప్రింట్‌తోపాటు కొనుగోలుదారులు, అమ్మకందారుల మెయిల్‌కు వచ్చేస్తాయి.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మరింత చేరువగా



స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వినియోగదారులకు మరింతగా చేరువ చేసేందుకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కార్డ్ సాఫ్ట్‌వేర్‌ను ఆధునీకరించి ప్రైమ్ 2.0ను రూపొందించారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానం క్రయవిక్రయదారులకు సులభంగా ఉండడంతోపాటు అవకతవకలు లేకుండా నిక్కచ్చిగా ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేని ఈ నూతన విధానం వినియోగాదారులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

– మాధవి, డీఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ

నేటి నుంచి అమల్లోకి...

కార్డ్ ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌తో స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ చేసే విధానం గురువారం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అమల్లోకి రానుంది. అనంతపురం జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలతోపాటు శ్రీ సత్యసాయి జిల్లాలో 9 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నేటి నుంచి నూతన సాఫ్ట్‌వేర్ ద్వారా రిజి స్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇప్పటికే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల నుంచి జిల్లా రిజిస్ట్రార్లకు స్పష్టమైన ఆదేశాలను జారీ చేశారు.

బిల్లులు పెండింగ్ పెట్టొద్దు



పెనకచర్ల వద్ద మిడ్ పెన్నార్ డ్యాంను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు ఏవీ పెండింగ్ ఉంచవద్దని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. లే అవుట్‌లలో ప్రత్యేక అధికారులు పర్యటించి నిర్మాణ పనుల వేగవంతానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ అంశంపై కలెక్టర్ బుధవారం తన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రత్యేక అధికారులు, ఉన్నతాధికారులు లే అవుట్‌ల పరిశీలనకు వెళ్లినప్పుడు బిల్లులు పెండింగ్ ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలి

ఇళ్ల నిర్మాణం వేగవంతానికి ప్రజాప్రతినిధులను భాగస్వాముల్ని చేయాలని కలెక్టర్ సూచించారు. ఆస్తకి ఉన్న ప్రజాప్రతినిధులు ఒక లే అవుట్‌ను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. మెగా గృహప్రవేశాలకు ముందే ప్రతి మండలం, మునిసిపాలిటీలో ఒక మోడల్ లే అవుట్‌ను గుర్తించాలని చెప్పారు. జిల్లాలోని 436 లే అవుట్‌లకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఎంపీఆర్ గేట్ల మరమ్మతులకు ఆదేశం

గార్లదిన్నె: మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) గేట్లు మరమ్మతులు చేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ గౌతమి హెచ్చెల్సీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఎంపీఆర్‌ను కలెక్టర్ పరిశీలించారు. లీకేజీలు పడకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మధుసూదన్, హెచ్చెల్సీ ఈఈ వెంకటరమణారెడ్డి, డీఈ చంద్రశేఖర్, జేఈలు సురేంద్ర, రాఘవేంద్ర, తహసీల్దార్ ఉషారాణి, సర్పంచులు ఉషారాణి, బచ్చలన్న పాల్గొన్నారు.

ఆంధ్రా సరిహద్దుకు చేరిన తుంగభద్ర జలాలు



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి విడుదల చేసిన నీరు బుధవారం రాత్రి 7 గంటలకు ఆంధ్రా సరిహద్దులోని 105వ కిలోమీటర్ వద్దకు చేరింది. గత శనివారం రాత్రి బళ్లారి జిల్లా కొళగల్లు సమీపంలోని 78వ కిలోమీటరు వద్ద హెచ్చెల్సీ కుడి కాలువకు గండి పడి 15 మీటర్లు వరకు తెగిపోయిన విషయం తెలిసిందే. నీరు బంద్ చేసి గండి పూడ్చివేశారు. మంగళవారం తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేయడంతో బుధవారం రాత్రి ఆంధ్రా సరిహద్దులోని రెగ్యులేటర్ వద్దకు చేరింది. ప్రస్తుతం హెచ్చెల్సీలో 1,000 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

నిద్రమత్తులో కిందపడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి


మృతుడు రమేష్‌గౌడ్

గుత్తి రూరల్: నిద్రమత్తులో తూలడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడి డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు...నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన వెంకటేష్ కుమారుడు రమేష్ గౌడ్ (23) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి తన స్నేహితుడు హర్షవర్దన్‌తో కలసి ప్యాపిలికి బండల లోడు తీసుకెళ్లాడు. అక్కడ అన్‌లోడ్ చేసిన వెంటనే తిరుగు ప్రయాణమయ్యాడు. బుధవారం ఉదయం గుత్తి మండలం వన్నేదొడ్డి శివారులోకి చేరుకోగానే 44వ జాతీయ రహదారిపై ట్రాక్టర్ నడుపుతున్న రమేష్‌గౌడ్ నిద్రమత్తులో తూలడంతో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పల్లంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో రమేష్ గౌడ్ అదుపు తప్పి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాలీలో ఉన్న హర్షవర్దన్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న గుత్తి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

బీటెక్ విద్యా ప్రణాళికలో సమూల మార్పులు

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) పరిధిలో బీటెక్ కోర్సుల్లో (రెగ్యులేషన్స్-23) సమూల మార్పులు తీసుకు వస్తున్నట్లు ఆ వర్సిటీ వీసీ డాక్టర్ జింకా రంగజనార్దన తెలిపారు. విద్యా ప్రణాళికలో మార్పు అంశంపై వర్సిటీ పరిధిలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లతో బుధవారం జేఎన్‌టీయూ (ఏ)లోని పాలక భవనంలో ఆయన సమావేశమై మాట్లాడారు. రెగ్యులర్ కోర్సుతో పాటు ఆనర్స్ డిగ్రీని ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ఆనర్స్ డిగ్రీ పొందాలంటే 15 క్రెడిట్‌లను అదనంగా సాధించాల్సి ఉంటుందన్నారు. 5 ప్రొఫెషనల్ ఎలక్టీవ్స్, 4 ఓపెన్ ఎలక్టీవ్స్, 5 ఓరియంటెండ్ కోర్సులతో పాటు క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని ప్రవేశపెడుతున్నట్లు వివరించారు. రెండు సమ్మర్ ఇంటర్న్‌షిప్‌లను రెండు, మూడో సంవత్సరం చివరలో నిర్వహించాల్సి ఉంటుందన్నారు. వీటికి 8 వారాల వ్యవధి ఉంటుందన్నారు. నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్‌లో ప్రాజెక్ట్ లేదా ఇంటర్న్‌షిప్ సెమిస్టర్ మొత్తం ప్రవేశపెడుతున్నామన్నారు. వీటితో పాటు ఆడిట్ కోర్సులూ పూర్తి చేయాలన్నారు. రెగ్యులర్ డిగ్రీలో మూడో సెమిస్టర్ వరకు 7 సీజీపీఏ సాధించిన విద్యార్థులు మాత్రమే డిగ్రీ రిజిస్టర్ చేసుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు. డిగ్రీలో మల్టీ ఎగ్జిట్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ సి. శశిధర్, డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ వి. సుమలత తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' జాబితా వేగవంతం

- ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి
- పరిశీలన ప్రక్రియ చేపట్టిన అధికారులు

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ-24 ప్రక్రియ వేగవంతమైంది. ఇందులో భాగంగా ఇప్పటికే చేపట్టిన ఇంటింటి సర్వేలో 7,17,472 కుటుంబాలను (నివాసాలు) అధికారులు సర్వే చేశారు. ఈ క్రమంలో ఓటరు నమోదు, తొలగింపు, వివరాల మార్పు, ఓటు బదిలీకి సంబంధించి మొత్తం 93,342 దరఖాస్తులు అందాయి. ఇందులో కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం-6) 26,190 దరఖాస్తులు, ఓటు తొలగింపునకు 28,351 దరఖాస్తులు, ఓటులో వివరాల మార్పు, నియోజవర్గం పరిధిలో ఓటు బదిలీకి 38,801 దరఖాస్తులు అందాయి. వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను అధికారులు చేపట్టారు. ప్రధానంగా ఓటు తొలగింపునకు అందే అభ్యంతరాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రతి దరఖాస్తునూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు.

కొత్త ఓటు నమోదుకు తక్కువే

కొత్తగా ఓటు నమోదుకు అందిన దరఖాస్తుల సంఖ్య తక్కువగానే ఉంది. ప్రధానంగా 2024, జనవరి1 తేదీ నాటికి వయసు 18 ఏళ్లు నిండనున్న యువతను కొత్త ఓటరుగా నమోదు చేయాలి. అయితే ప్రస్తుతం ఓటు నమోదుకు (ఫారం-6) 26,190 దరఖాస్తులు అందాయి. జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో వయసు 18 ఏళ్లు నిండిన వారు, 2022, జనవరి 1వ తేదికి 18 ఏళ్లు నిండనున్నవారు 80 వేల వరకు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం కొత్తగా ఓటు నమోదుకు వచ్చిన దరఖాస్తుల సంఖ్య పరిశీలిస్తే యువతను ఓటరుగా నమోదు ఆశించిన స్థాయిలో జరగలేదనేది స్పష్టమవుతోంది.

తొలగింపులపై ప్రత్యేక పరిశీలన

ఓటు తొలగింపునకు వచ్చిన దరఖాస్తులను అధికారులు ప్రత్యేకంగా పరిశీలిస్తారు. ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం చేసి ఉంటే... వాటిని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) వ్యక్తిగతంగా పరిశీలిస్తారు. అటువంటి అభ్యంతరాలను ఈఆర్ఓ నియమించిన ఏఈఆర్ఓ, బీఎల్ఓ, డిప్యూటీ తహసీల్దారు హోదా కలిగిన ముగ్గురు సభ్యుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తుంది. ఈ క్రమంలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్‌లకు క్షేత్రస్థాయి పరిశీలన షెడ్యూల్‌ను తెలియజేస్తారు. క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో హాజరుకావాలని అభ్యంతరం దాఖలు చేసిన వ్యక్తికి నోటీసు ఇస్తారు. ముగ్గురు సభ్యుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన నివేదికను ఈఆర్‌ఓకు సమర్పిస్తుంది. దాని ఆధారంగా ఈఆర్ఓ వ్యక్తిగత విచారణ నిర్వహిస్తారు. అభ్యంతరం దాఖలు చేసి వ్యక్తి కూడా ఈ విచారణకు హాజరుకావాలి.


ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది (ఫైల్)

నియోజకవర్గాల వారీగా సర్వేలో అందిన దరఖాస్తులు ఇలా

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	కుటుంబాలు	ఫారం-6	ఫారం-7	ఫారం-8
రాయదుర్గం	2,54,392	99,200	3,062	1,424	4,190
ఉరవకొండ	2,15,481	79,817	1,765	1,126	3,029
గుంతకల్లు	2,60,946	79,388	4,098	3,549	6,626
తాడిపత్రి	2,39,216	85,042	1,651	687	2,365
శింగనమల	2,39,349	71,603	3,033	3,430	4,132
అనంతపురం	2,47,058	91,895	5,842	2,324	10,579
కళ్యాణదుర్గం	2,23,587	95,207	3,676	7,891	5,005
రాప్తాడు	2,45,451	1,15,320	3,063	7,920	2,875
మొత్తం	19,35,480	7,17,472	26,190	28,351	38,801

అభ్యంతరం తప్పని తేలితే శిక్ష

ఓటు తొలగింపునకు సంబంధించి వ్యక్తి దాఖలు చేసిన అభ్యంతరం వాస్తవమని తెలితే... నిర్ణీత ప్రక్రియను అనుసరించి ఓటరు జాబితా నుంచి ఓటును తొలగిస్తారు. అయితే వ్యక్తి దాఖలు చేసిన అభ్యంతరం తప్పు అని తేలితే... ప్రజాప్రాతినిధ్యం చట్టం 1950లోని సెక్షన్ 31 కింద వారిపై కేసు నమోదు చేస్తారు. వారికి ఒక ఏడాది జైలు శిక్ష లేక జరిమాన లేదా రెండు విధిస్తారు..

ఇంటింటి సర్వేలో అందిన మొత్తం దరఖాస్తులు

93,342

కొత్తగా ఓటు నమోదుకు అందిన దరఖాస్తులు

26,190

ఓట్ల తొలగింపునకు సంబంధించిన దరఖాస్తులు

28,351

ఓటరు జాబితాలో వివరాల మార్పు, ఓటు బదిలీ దరఖాస్తులు

38,801

పరిశీలన షెడ్యూల్ ఇలా...

- సెప్టెంబరు 29వ తేదీ వరకు పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్, జాబితా సవరణకు సంబంధించిన పనులు నిర్వర్తిస్తారు.
- సెప్టెంబరు 30వ తేదీ నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ నిర్వహిస్తారు. 17వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ.
- అక్టోబరు 17వ తేదీ నుంచి నవంబరు 30వ వరకు ఓటరు జాబితా సవరణపై క్లయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ.
- డిసెంబరు 26వ తేదీ నాటికి క్లయిమ్‌లు, అభ్యంతరాలకు పరిష్కారం.
- 2024, జనవరి 1వ తేదీ ఓటర్ల జాబితా సిద్ధం.
- 2024, జనవరి 5వ తేదీ తుది జాబితా ప్రచురణ.

'ఆ'జాదూపై విచారణ ప్రారంభం


రొళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టిన డీఎల్‌డీఓ శివారెడ్డి

అనంతపురం సిటీ/రొళ్ల: అనేక ఆరోపణలు, విమర్శలకు కేంద్ర బిందువైన శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల మండల పరిషత్ అధికారి ఆజాద్‌పై విచారణ మొదలైంది. విచారణాధికారిగా నియమితులైన ధర్మవరం డీఎల్‌డీఓ శివారెడ్డి బుధవారం రొళ్లకు చేరుకుని మండల పరిషత్ సిబ్బందితో పాటు స్థానిక ప్రజాప్రతినిధులను వేర్వేరుగా విచారణ చేశారు. ప్రభుత్వ కార్యాలయాన్నే బార్‌గా మార్చి మద్యం తాగడం, మహిళా చిరుద్యోగులతో అసభ్యంగా ప్రవర్తించడం తదితర అక్రమాలను ఇటీవల జెడ్పీ సమావేశంలో ఆ మండల జెడ్పీటీసీ సభ్యురాలు ఏకరవు పెట్టారు. అంతేకాక జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ల చేతన్‌తో పాటు జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్ గార్గ్‌ను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ అంశానికి సంబంధించి 'ఆ'జాదూ ఎంపీడీఓ మాకొద్దు', 'ఆ'జాదూపై సమగ్ర విచారణ' శీర్షికలతో 'సాక్షి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. దీంతో ఆజాద్ అక్రమాలపై విచారణాధికారిగా డీఎల్‌డీఓ శివారెడ్డిని ఉన్నతాధికారులు నియమించిన విషయం తెలిసిందే. కాగా, తనపై విచారణ జరుగుతున్న సమయంలో పక్కదారి పట్టించేందుకు ఎంపీడీఓ ఆజాద్ విశ్వ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. దాదాపు 30 మంది ప్రైవేట్ వ్యక్తులను కార్యాలయానికి రప్పించుకుని విచారాణాధికారిని ప్రభావితం చేసేలా ప్రయత్నించడం దుమారం రేపింది. దీంతో మరోసారి జెడ్పీటీసీ సభ్యురాలు నేరుగా ఫోన్ ద్వారా విషయాన్ని జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్ గార్గ్‌కు వివరించారు.

విద్యుదాఘాతంతో బోరు మెకానిక్ మృతి

పామిడి: విద్యుత్ షాక్‌తో ఓ బోరు మెకానిక్ మృతి చెందాడు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం మిడుతూరు నివాసి ఈశ్వరయ్య (30), అశ్విని దంపతులు. ప్రస్తుతం అశ్విని 8 నెలల గర్భిణి. పామిడి లోని ప్రసాద్ వద్ద ఈశ్వరయ్య బోరు మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పామిడి మండలం నెమళ్లపల్లి శివారులోని రైతు నాగమునయ్య పొలంలోని బోరుబావిలో సబ్ మెర్సిబుల్ మోటారు మరమ్మతుకు లోనవడంతో దానిని వెలికి తీసేందుకు బుధవారం వెళ్లాడు. బోరు బావి నుంచి పైపులు పైకెత్తుతున్న సమయంలో ఉపరితలంలో ఉన్న 11కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై ఈశ్వరయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అతనికి సహాయకులుగా వెళ్లిన వంకరాజుకాల్వకు చెందిన హుస్సేన్, బషీర్, ఎదురూరు నివాసి ఆశీర్వాదం తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే పామిడి సీహెచ్‌సీకి తరలించారు. విషయం తెలుసుకున్న డీసీసీబీ మాజీ చైర్మన్ వీరాంజనేయులు ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఈశ్వరయ్య మృతదేహాన్ని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. ఘటనపై పామిడి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


సర్వజనాస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

బాధితులను పరామర్శించిన జెడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం సిటీ: విద్యుత్ ప్రమాద బాధితులు హుస్సేన్, బషీర్, ఆశీర్వాదంను జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పరామర్శించారు. పామిడి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురంలోని సర్వజనాస్పత్రికి కుటుంబసభ్యులు తరలించారు. విషయం తెలుసుకున్న గిరిజమ్మ నేరుగా సర్వజనాస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ప్రమాదఘటనపై ఆరా తీశారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు సూచించారు.. ఆమె వెంట వంకరాజుకాలువ సర్పంచ్ రమణారెడ్డి ఉన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- పోలీసు కుటుంబ సభ్యులకు ఎస్పీ భరోసా


చెక్కు అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అధైర్య పడొద్దు.. అన్ని విధాలుగా అండగా ఉంటామని వివిధ కారణాలతో మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబసభ్యులకు ఎస్పీ కె.శ్రీనివాసరావు భరోసానిచ్చారు. కష్టం వస్తే ఆపన్నహస్తం అందించే బాధ్యత కూడా పోలీసుశాఖదేనన్నారు. మృతి చెందిన పోలీసు సిబ్బంది, అధికారుల కుటుంబాల సభ్యులతో జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఆయన కలసి మాట్లాడారు. క్షేమ సమాచారాలు, సాధకబాధకాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అందాల్సిన ప్రయోజనాలపై సమీక్షించారు. కారుణ్య నియమకాల విషయంలోనూ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం దివంగత సీఐ ఆనందరావు, ఏఆర్ కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు చెరో రూ.లక్ష చొప్పున చెక్కులను అందజేశారు. ఇటీవల మృతి చెందిన బ్రహ్మసముద్రం కానిస్టేబుల్ ఉమేష్ కుటుంబసభ్యులకు విడో, ఫ్లాగ్ ఫండ్ కింద రూ. 75 వేల విలువ చేసే చెక్కును అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, ఆర్ఐ రాముడు, జిల్లా పోలీసు కార్యాలయ పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోకనాథ్, సుధాకర్ రెడ్డి, తేజ్‌పాల్, జిల్లా పోలీసు కార్యాలయం సూపరింటెండెంట్లు శ్రీనివాసులు, సావిత్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు

- ముగిసిన వెబ్ కౌన్సెలింగ్
- పదోన్నతులు పొందిన వారికి జిల్లాల కేటాయింపు

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పని చేస్తున్న పరిపాలనాధికారులు(ఏఓలు), ఈఓఆర్‌డీలకు పదోన్నతులు లభించాయి. పలువురికి ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ బుధవారం ఆ శాఖ ఉన్నతాధికారులు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో నలుగురు ఈఓఆర్‌డీలు, ఇద్దరు ఏఓలకు ఎంపీడీఓలుగా అవకాశం దక్కింది. వారికి జిల్లాలు సైతం కేటాయించారు.

పదోన్నతి పొందిన వారి వివరాలు ఇలా..

అధికారి	ప్రస్తుత హోదా, ప్రదేశం	బదిలీ ప్రదేశం
బారాన్ సాహెబ్	ఈఓఆర్‌డీ, గుంతకల్లు	అన్నమయ్య జిల్లా
లక్ష్మీనరసింహ	ఈఓఆర్‌డీ, నార్పల	అన్నమయ్య జిల్లా
పోలప్ప	మండల పరిషత్ ఏఓ,కొత్తచెరువు	అన్నమయ్య జిల్లా
రవికుమార్	ఏఓ, జెడ్పీ, అనంతపురం	వైఎస్సార్ జిల్లా
ఖాదర్‌బాషా	ఈఓఆర్‌డీ, ముదిగుబ్బ	చిత్తూరు జిల్లా
సుహాసిని	ఈఓఆర్‌డీ, చిలమత్తూరు	కర్నూలు జిల్లా

అమాయకుడి ఉసురు తీశారు

- బెస్త నరేష్ మృతి కేసులో భార్య, ఆమె ప్రియుడికి రిమాండ్
- నిందితుడు టీడీపీ నేత

రాయదుర్గం: మండలంలోని డి కొండాపురంలో బెస్త నరేష్ (30) మృతి కేసులోమ ఆయన భార్య, ఆమె ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. రాయదుర్గం అర్బన్ సీఐ లక్ష్మన్న తెలిపిన మేరకు.. డి.కొండాపురంలో నివాసముంటున్న నరేష్ భార్య లావణ్యతో అదే గ్రామానికి చెందిన మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ముఖ్య అనుచరుడు బోయ హనుమంతప్ప కుమారుడు బోయ మోహన్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ విషయం నరేష్‌కు తెలియడంతో ఎలాగైనా అతణ్ని అడ్డు తొలగించుకోవాలని పథకం వేశారు. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి కుమార్తె సుమతో కలసి దంపతులు నిద్రించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత అదే గదిలో నరేష్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ నరేష్ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ లక్ష్మన్న కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా లావణ్యతో పాటు మోహన్‌ను తమదైన శైలిలో విచారణ చేయడంతో తాము హత్య చేయలేదని, అయితే తమ మధ్య సంబంధానికి అడ్డు తొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో తరచూ 'నీవు చస్తే బాగుంటుందని' చెప్పేవాళ్లమని అంగీకరించారు. తమ మాటలతో మనస్తాపం చెందిన నరేష్ చివరకు ఆత్మహత్య చేసుకున్నాడని వివరించారు. ఘటనకు సంబంధించి నిందితులపై ఐపీసీ 306 సెక్షన్ కింద బుధవారం కేసు నమోదు చేసి కళ్యాణదుర్గం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

భార్య కళ్లెదుటే భర్త దుర్మరణం

అనంతపురం సిటీ: భార్యతో కలసి సొంతూరుకు బయలుదేరిన ఓ యువకుడు మరి కాసేపట్లో ఇంటికి చేరుకుంటాడనగా రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. తన కళ్లెదుటే భర్త ప్రాణాలు కోల్పోవడంతో భార్య గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటన అనంతపురం రైల్వే స్టేషన్‌లో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జీఆర్పీ ఎస్ఐ విజయకుమార్ తెలిపిన మేరకు.. అనంతపురంలోని నీరుగంటి వీధికి చెందిన చింతమేకల సాయికిరణ్(24) తన భార్య దివ్యశ్రీతో కలసి బెంగళూరులో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే భార్యతో కలసి మంగళవారం రాత్రి అనంతపురానికి రైలులో బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు రైలు అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుండగా.. భార్యతో పాటు లగేజ్ తీసుకుని తలుపు వద్దకు సాయికిరణ్ చేరుకున్నాడు. ఆ సమయంలో అదుపు తప్పి సాయికిరణ్ కిందపడ్డాడు. కళ్లెదుటే రైలులో నుంచి భర్త జారి పడుతుండగా దివ్యశ్రీ పట్టుకునే ప్రయత్నం చేసింది. అయినా ఫలితం లేకపోయింది. రైలు చక్రాల కింద పడి సాయికిరణ్ దేహం ముక్కలైంది. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సూపర్ స్పెషాలిటీలో సీసీబీ ఏర్పాటుకు స్థల పరిశీలన

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ (సీసీబీ) ఏర్పాటుకు అనుమతులు జారీ అయ్యాయి. క్లిష్టతరమైన కేసులకు మెరుగైన వైద్యం అందించేలా రూ.23.75 కోట్ల నిధులను ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్(పీఎం-ఏబీహెచ్ఐఎం) మంజూరు చేసింది. దీంతో ఈ ఏడాది మార్చి నాటికి సీసీబీ అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో సీసీబీ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ) ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ మహబూబ్ తదితరులు పరిశీలన చేశారు. వారి వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సూపర్ స్పెషాలిటీ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్య కుమార్ తదితరులున్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాసరావు

అనంతపురం: ప్రజా ప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ కె. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజాప్రయోజన సేవల శాశ్వత లోక్ అదాలత్ సేవలపై జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో నగర పాలక సంస్థ వార్డు అడ్మిన్ కార్యదర్శులకు బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇరుపక్షాల సమస్యను సామరస్యంగా పరిష్కరించి, సమాన అవకాశాలు ఇస్తూ రాజీ కుదరని పక్షంలో ధర్మాసనం తీర్పు వెలువరిస్తుందని, ఇది అప్పీలు లేని శాశ్వత లోక అదాలత్ తీర్పు అవుతుందన్నారు. మధ్య వర్తిత్వ కేంద్ర సభ్యులు న్యాయవాది హరికృష్ణ మాట్లాడుతూ.. కోర్టుల్లో దాఖలు చేయని వివాదాలు మాత్రమే శాశ్వత లోక్ అదాలత్‌లో దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసిన తరువాత ఇతర సివిల్ కోర్టులలో ఆ కేసు దాఖలు చేసే అవకాశం లేకుండా శాశ్వత పరిష్కారం అందుతుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ సభ్యులు రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ.. శాశ్వత లోక్ అదాలత్ పరిధిలో వచ్చే ప్రజా ప్రయోజన సేవల వివరాలపై అవగాహన కలిప్పించారు. కాగా, అంతకు ముందు నిర్వహించిన మరో కార్యక్రమంలో దుకాణాలు, సంస్థల ప్రతినిధులు, మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులతో లోకదాలత్ నిర్వహణ, శాశ్వత లోక్ అదాలత్ సేవల తీరును జిల్లా న్యాయప్రాధికార సంస్థ కార్యదర్శి జి. దీనబాబు, శాశ్వత లోకదాలత్ న్యాయమూర్తి కే శ్రీనివాసరావు లు వివరించారు. సెప్టెంబరు 9వ తేదీ నిర్వహించే నేషనల్ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

నలుగురికి జైలు శిక్ష

అనంతపురం: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తిని బెదిరించి, అతని ఆత్మహత్యకు కారకులైన నలుగురికి జైలు శిక్ష విధిస్తూ అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన బుధవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. ఉరవకొండ మండలం కోనాపురానికి చెందిన ధనుంజయకు అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉండేది. ఈ క్రమంలో అతణ్ని మీనుగ వన్నూరు స్వామి, వెంకటేశులు, ఎం.నాగరాజు, శ్రీనివాసులు, నాగరాజు హత్య చేస్తామంటూ బెదిరించారు. వారి బెదిరింపులకు భయపడి 2016, డిసెంబర్ 3న ధనుంజయ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనకు సంబంధించి అప్పటి ఉరవకొండ ఎస్ఐ నగేష్ బాబు కేసు నమోదు చేశారు. పక్కా ఆధారాలతో ధనుంజయ ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించారంటూ నిందితులను కోర్టులో ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి ఈ కేసు వాదనలు జరుగుతూ వచ్చాయి. వాదనలు విన్న తర్వాత నేరం రుజువు కావడంతో బుధవారం అనంతపురం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి దీన తీర్పు వెలువరించారు. ముద్దాయిలకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు చెరో రూ.10 వేలు జరిమానా విధించారు.

'స్కోచ్' అవార్డుకు జీఆర్పీ ఎంపిక

గుంతకల్లు: ప్రతిష్టాత్మక స్కోచ్ అవార్డుకు గుంతకల్లు రైల్వే జిల్లా గవర్నమెంట్ రైల్వే పోలీస్ (జీఆర్పీ) ఎంపికైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం రాత్రి జీఆర్పీ ఎస్పీ చౌడేశ్వరి తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. నేరాల నియంత్రణ కోసం సస్పెక్ట్ మానిటరింగ్ సిస్టం (ఎస్ఎంఎస్) యాప్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. రైళ్లు, ప్లాట్ ఫామ్, రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానిత వ్యక్తుల నుంచి ఎస్ఎంఎస్ యాప్ ద్వారా వేలిముద్రలు తీసుకుంటామన్నారు. దీంతో వారి నేర చరిత్ర బయటపడుతుందన్నారు. అంతే కాకుండా ప్రయాణికుల భద్రత, వారి ఆస్తుల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, డీజీపీ ఆదేశాలతో దాదాపు 104 మంది అదనపు సిబ్బందిని నియమించారు. దీంతో రాత్రింబగళ్లు రైళ్లల్లో గస్తీ నిర్వహించి దొంగతనాలు అదుపు చేయగలిగామన్నారు. ఈ ఏడాది రూ.1.70 కోట్లు ప్రయాణికుల నుంచి దొంగిలించగా.. అందులో రూ. 80 లక్షల మేర రికవరీ చేశామన్నారు. దీంతో గుంతకల్లు డివిజన్ వ్యాప్తంగా రైళ్లలో చోరీలు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్పీ పోలీసులు చూపిన ప్రతిభకు గుర్తింపుగా 'స్కోచ్' అవార్డుకు ఎంపిక చేశారన్నారు. త్వరలోనే అవార్డు అందజేస్తారన్నారు.

క్లుప్తంగా

దేశభక్తిని పెంపొందించాలి



అధికారులకు అవగాహన కల్పిస్తున్న దీనబాబు

అనంతపురం: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి గరికపాటి దీనబాబు వివిధ సంస్థల అధికారులతో బుధవారం అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే అంశంపై వివిధ విద్యా సంస్థల అధ్యాపకులు, బోధన సిబ్బంది, మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ, బాలల సంక్షేమం కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థల అధికారులకు అవగాహన కల్పించారు. విద్యా సంస్థల్లో స్నేహపూర్వక వాతావరణం ఉండేలా కృషి చేయాలన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ శివప్రసాద్

రాప్తాడు: పౌష్టికాహారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండొచ్చని సీహెచ్ఓ శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో 10 నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న 280 మంది బాలికలకు వైద్య సిబ్బంది హిమోగ్లోబిన్ పరీక్ష, ఎత్తు, బరువు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజా దేవి, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీ, ఏఎన్ఎంలు శ్రీదేవి, లీలావతి, ఎంపీహెచ్ఏ నారాయణ స్వామి, కంబాగిరి స్వామి, ఆశా కార్యకర్తలు అరుణ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

హంపీ హాస్టల్ ప్రారంభం



నూతన హాస్టల్‌ను ప్రారంభిస్తున్న వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోనూతనంగా నిర్మించిన హంపి హాస్టల్‌ను వీసీ జింకా రంగజనార్దన బుధవారం ప్రారంభించారు. బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు ఈ హాస్టల్‌లో వసతి ఏర్పాటు చేస్తామని వీసీ పేర్కొన్నారు. హంపీ బాయ్స్ హాస్టల్ నిర్మాణానికి ఏఐసీటీఈ ఆర్థిక సహకారం అందజేసిందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణకాంతి, హాస్టల్ మేనేజర్ టి. బాల నరసయ్య, డాక్టర్ ఎస్ .చంద్రమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ మేనేజర్‌గా బాలనరసయ్య

జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల నూతన హాస్టల్ మేనేజర్‌గా ప్రొఫెసర్ టి. బాలనరసయ్యను నియమించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టల్ మేనేజర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్ ఆయన్ని అభినందించారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



ఆహా క్యాంటీన్ ప్రారంభిస్తున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్, మెప్మా అర్బన్ మార్కెట్‌ను మేయర్ వసీం బుధవారం ప్రారంభించారు. మహిళా సంఘాల సభ్యులు తయారు చేసి విక్రయిస్తున్న వివిధ రకాల ఆహార, తదితర ఉత్పత్తులను మేయర్ పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ మహిళా సాధికారత ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేద, సామాన్య మధ్య తరగతి ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపర్చడానికి ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వాములను చేసినట్లు తెలిపారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ భాగ్యలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్ కమల్‌భూషణ్, టీఎంసీ శ్రీనివాస్ రెడ్డి, సీఓలు సత్యమూర్తి, భువనేశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్

రాప్తాడురూరల్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం ముగిసింది. ముగింపు సభను కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, రాష్ట్ర కమిటీ సభ్యుడు వైటీసీ రమేష్, రాష్ట్ర బాలికల కమిటీ సభ్యురాలు రజిత, జిల్లా బాలికల కన్వీనర్ సునీత, నాయకులు తరిమెల గిరి, సిద్ధార్థ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడిమి జగనన్న కాలనీలో దౌర్జన్యం

- బలవంతంగా రోడ్లు, ప్లాట్ల రాళ్లను తొలిగించి చదును చేసిన వైనం
- ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలకు అడ్డంగా బండరాళ్లు
- పట్టించుకోని రెవెన్యూ, హౌసింగ్ అధికారులు
- క్రిమినల్ కేసులు పెడతామన్న తహసీల్దార్ శ్రీధర్





మట్టిరోడ్లను తొలగించి చదును చేసిన దృశ్యం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలకు అడ్డంగా తోలిన గుండ్లు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి జగనన్న కాలనీ భూముల్లో ప్రభుత్వం ప్లాట్లు వేసి రూ.లక్షలు ఖర్చు చేసి, మట్టిరోడ్లు నిర్మించింది. ప్రతి ప్లాటుకూ రాళ్లను నాటించారు. అయితే కొందరు దౌర్జన్యంగా వీటిని తొలిగించి, చదును చేయడం కలకలం రేపుతోంది. అసైన్‌మెంట్ ద్వారా తీసుకున్న భూములను అమ్మినా, కొనుగోలు చేసినా చెల్లుబాటు కావు. అయితే కొడిమి జగనన్న కాలనీకి తీసుకున్న భూముల్లో 34 ఎకరాల భూములు అసైన్‌మెంట్ ద్వారా పొందిన వారి నుంచి ఇతరులు కొనుగోలు చేసి, ఏకంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పాసు బుక్కులు కూడా చేయించుకున్నారు. నిబంధనల ప్రకారం కొనుగోలు చేయకూడదని అధికారులు స్పష్టం చేశారు. ఈ భూములపై ప్రస్తుతం ఉన్నవారికి ఎలాంటి హక్కు ఉండదని, వారివద్ద ఉన్న పాసు బుక్కులు చెల్లవని స్పష్టం చేశారు. ఎవరూ పంటలు పెట్టేందుకు వీలులేదని కూడా చెప్పారు. పైగా ఇవన్నీ కూడా ఇటీవలే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఆ భూముల్లోకి ఎవరైనా బలవంతంగా వెళ్లినా చట్టరీత్యా నేరం. ఇవేవీ పట్టని దొక్కా నాగార్జున అనే వ్యక్తి ఏకంగా ఆముదం పంట సాగు చేశాడు. జింకా సత్యనారాయణ అనే వ్యక్తి ప్లాట్ల రాళ్లు, మట్టిరోడ్లను జేసీబీతో తొలగించేశాడు. సాంబశివ అనే వ్యక్తి సాగు చేసి దానిమ్మ మొక్కలు సాగు చేశాడు.

ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాలకు అడ్డంగా గుండ్లు : ఈ భూముల్లో తొలిగించిన పెద్దపెద్ద గుండ్లను పక్కనే ఉన్న ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల ముందు అడ్డంగా పెట్టారు. ఈ కార్యాలయాల్లోకి వెళ్లాలంటే ఈ గుండ్లు అడ్డుగా ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాల పక్కనే మూడురోజులుగా ఈ తతంగం నడుస్తున్నా స్థానికంగా ఉండే రెవెన్యూ అధికారులు కాని, హౌసింగ్ సిబ్బంది కాని కనీసం పట్టించుకోకపోవడం విశేషం.

క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం



కొడిమి జగనన్న కాలనీలోని భూములను కొందరు చదును చేయించారనే సమాచారం నాదృష్టికి రాలేదు. వెంటనే విచారించి పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. అసైన్‌మెంట్ భూములు కొనుగోలు చేస్తే చెల్లవు. ఈ విషయం వారికి స్పష్టంగా తెలియజేశాం. ఆ భూములను రిజంసన్ చేసుకున్నాం. ఇప్పుడు పంటలు ఎలా పెడతారు. తమాషా చేస్తారా?. బలంతంగా ఆ భూముల్లోకి ఎవరైనా వెళ్తే క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

– శ్రీధరమూర్తి, తహసీల్దార్, అనంతపురం

అనురాగ బంధానికి అపూరూప వేడుక



ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌కు రాఖీ కడుతున్న శారదా సిస్టర్

అనంతపురం కల్చరల్: నగరంలోని చెరువుకట్ట వద్ద ఉన్న ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీలు నగరంలోని పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యా సంస్థలలోని యువత , రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీల జిల్లా ఇన్‌చార్జ్ సిస్టర్ శారదా మాట్లాడుతూ కేవలం అన్నాచెల్లెళ్ల పండుగగానే కాకుండా సమస్త మానవాళిని అనుబంధాలంతో ఏకం చేసే రక్షాబంధన్ మహోత్సవం భారతీయ సంస్కృతికి అద్దం పట్టే పర్వదినమన్నారు. పౌర్ణమి ఘడియలు ఉన్నందున అందరూ గురువారం రక్షాబంధన్ కార్యక్రమాలను చేస్తున్నారని బ్రహ్మకుమారీలు కూడా అదేరోజు రాఖీ పర్వదినాలను ముగిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, జడ్పీ చైర్మన్ బోయ గిరిజమ్మ, నగర మేయర్ వసీం, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా జడ్జి శ్రీనివాస్, నగరపాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, డీఎస్పీ ప్రసాదరెడ్డి తదితరులకు రాఖీలు కట్టారు.

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ వేడుకలను జరుపుకున్నారు. మహిళలు శ్రావణ గౌరీ వ్రతాలు నిర్వహించారు. రాప్తాడులోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థినులతో విద్యార్థులకు రాఖీలు కట్టించి, శ్రావణ పౌర్ణమిని జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అన్నచెల్లెళ్ల అనుబంధానికీ ప్రతీక రాఖీ

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా సోదర భావాలకు ప్రతీకకగా చెప్పుకునే రాఖీ పండుగను బుధవారం జరుపుకున్నారు. అక్కా తమ్ముడు, అన్నా చెల్లెలు ఇలా ప్రతి ఒక్కరూ తమ బంధాలను గుర్తు చేసుకుంటూ అన్నలకు, తమ్ముళ్లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. మండల వ్యాప్తంగా ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు దగ్గరుండి పిల్లలకు రాఖీలు కట్టించి బంధాల గురించి తెలియజేశారు.

దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలి



ర్యాలీలో పాల్గొన్న జేఎన్‌టీయూ వీసీ రంగజనార్దన

అనంతపురం: దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటును అందించాలని జేఎన్‌టీయూ అనంతపురం వీసీ జింకా రంగజనార్దన అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఎన్ఎస్ఎస్ విభాగంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ' నా భూమి– నా దేశం' అనే కార్యక్రమం బుధవారం ముగిసింది .ఈ నెల 9 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ముగింపు సందర్భంగా కలెక్టర్ ఆఫీసు వద్ద ఉన్న వైజంక్షన్ నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. నూతన శాస్త్రసాంకేతిక రంగాల్లో యువత ప్రతిభ చూపడమే ఇందుకు కారణమన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.మమత, తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్ఓను కలిసిన ఎన్‌జీఓ సంఘం నేతలు

అనంతపురం క్రైం: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవిని ఎన్‌జీఓ సంఘం నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్‌జీఓ సంఘం నాయకులు డీఎంహెచ్ఓకు సన్మానించారు. ఏపీఎన్‌జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జే మాధవ, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ జమీల బేగం, కార్యనిర్వాహణ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చంద్ర హాస్పిటల్ తనిఖీ : చంద్ర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏపీ మెడికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ (ఏపీఎంసీఈ), స్కానింగ్‌కు సంబంధించి ప్రీ కాన్సెప్షన్ ప్రినేటల్ డయాగ్నస్టిక్స్ టెక్నిక్స్, పీసీపీఎన్‌డీ యాక్ట్ ప్రకారం ఆస్పత్రిలో ధరల పట్టిక, రిజిస్ట్రేషన్ గడువు, వైద్యుల అర్హతలపై ఆరా తీశారు. ఇటీవల చంద్ర ఆస్పత్రిలో ఓ మహిళ మృతి చెందిన విషయం విదితమే. డిప్యూటీ డెమో త్యాగరాజు, హెచ్ఈఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత్ పక్వాడ్' నిర్వహించాలి

రాప్తాడురూరల్: జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు 'స్వచ్ఛత్ పక్వాడ్' కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి వి.నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 15 వరకు ఆయా రోజుల్లో చేయాల్సిన వివిధ స్వచ్ఛతా చైతన్య కార్యక్రమాలను నిర్దేశించారని పేర్కొన్నారు. కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను సంబంధిత లింక్ ద్వారా రోజూ అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేసేలా ఎంఈఓలు, ఉప విద్యాధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఫర్నీచర్ దుకాణంలో చోరీ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: గుత్తిరోడ్డు బ్రాహ్మణి ఫర్నీచర్ దుకాణంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దుకాణంలో ఉన్న రూ. 75 వేలు నగదును అపహరించారు. ఉదయం దుకాణం తెరిచిన యజమాని నారాయణస్వామి.. చోరీ జరిగిన విషయాన్ని తెలుసుకొని వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప మాట్లాడుతూ దుకాణం వెనుక వైపున షెడ్ రేకులను కట్ చేసి, లోపలకు చొరబడ్డారు. క్యాష్ లాకరు తెరిచి, నగదు అపహరించారన్నారు.

ఫెలోషిప్‌కు డాక్టర్ ఆరేటి శివయ్య ఎంపిక

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్వ విద్యార్థి డాక్టర్ ఆరేటి శివయ్య ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఎక్స్‌పీరియన్స్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు (సెర్బ్) అందించే ఈ ఫెలోషిప్ జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా భావిస్తారు. ఈ ఫెలోషిప్ ద్వారా కనెక్టికట్ వర్సిటీ (యూఎస్ఏ)లోని కెమిస్ట్రీ విభాగంలో నాలుగు నెలల పాటు పరిశోధన చేస్తారు. నెలకు రూ.2.5 లక్షల ఫెలోషిప్ మొత్తంతో పాటు రూ.75 వేలు కాంటిన్‌జెన్సీ గ్రాంట్ , రూ.20 వేల మెడికల్ బీమా అందిస్తారు. సర్దార్ వల్లభాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్వీఎనిట్)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

తమిళనాడులో పర్యటించిన ఎంపీ

అనంతపురం క్రైం: ఎంపీ తలారి రంగయ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడి హోదాలో తమిళనాడు పర్యటనకు వెళ్లారు. అందులో భాగంగా తమిళనాడులోని దిండిగల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న పనులను ఎంపీ పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని గురువారం పలు ప్రాంతాల్లో 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతు చేస్తుండడంతో విద్యుత్‌సరఫరా ఉండదని డీఈ నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ 4 సెక్షన్ పరిధిలోని జీసస్‌నగర్, అరవింద్‌నగర్, నాయక్‌నగర్, ఆదర్శనగర్, హౌసింగ్ బోర్డు, విద్యుత్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ 1వ సెక్షన్ పరిధిలోని శారదానగర్, విజయనగర్ కాలనీ, టీవీటవర్, ఫెర్రర్ కాలనీ, బెంగళూరురోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

సమ్మె కొనసాగిస్తాం

అనంతపురం రూరల్: సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో అధికారుల విఫలం అయ్యారని, సమ్మెను కొనసాగిస్తామని సీఐటీయూ నాయకులు తెలిపారు. బుధవారం సత్యసాయి వాటర్ బోర్డు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈతో సత్యసాయి వాటర్ సరఫరాకార్మికులు, సీఐటీయూ నాయకులు చర్చలు జరిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

అనంతపురం కల్చరల్: రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల వరకు వైభవంగా జరగనున్నట్లు మొదటిరోడ్డు మంత్రాలయ మఠం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. 31న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, గోపూజలు, లక్ష్మీపూజ శాకోత్సవం, తదితర పూజలు ఉంటాయన్నారు. 1న మధ్యారాధనలో మంత్రాలయ రాఘవేంద్రుల బృందావనానికి శ్రీగంధ పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, 2న పాదపూజలు, కనకాభిషేకం, సాయంత్రం మహా రథోత్సవం ఉంటుందన్నారు.

బలరామ జయంతికి ఏర్పాట్లు

అనంతపురం కల్చరల్: బలరామ జయంతి వేడుకలకు ఇస్కాన్ మందిర సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. బుధవారం రాధా పార్థసారథుల ముందు రక్షాబంధనాలను సమర్పించారు. ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు మాట్లాడుతూ గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. 11 గంటలకు అభిషేకం, మధ్యాహ్నం 1 గంటకు భక్తులకు స్వామివారి ప్రసాద వితరణ, సాయంత్రం నగర వీధుల్లో శోభాయాత్ర కనులపండువగా సాగుతుందన్నారు. పాతూరు నుంచి కలెక్టరేట్ వద్ద ఉన్న ఇస్కాన్ గోశాల వరకు సాగే శోభాయాత్రలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

కరువు పీడిత ప్రాంతాలను ఆదుకోవాలి

అనంతపురం కల్చరల్: కరువు పీడిత ప్రాంతాలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 'సందర్భం – సమాలోచన ' అనే అంశాలపై చర్చావేదిక జరిగింది. డాక్టర్ రమేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ గేయానంద్, సీపీఎం నాయకులు రాంభూపాల్, జాఫర్, డాక్టర్ ప్రసూన, మానవ హక్కుల నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం బాషా, రెడ్స్ భానూజ, బీజేపీ దుద్దేకుంట వేంకటేశ్వరరెడ్డి, ప్రజాపక్షాల తరపున కసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ముదార్ సుధీర్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు బాబుద్దీన్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించండి

ఆత్మకూరు: కరువు మండలంగా ప్రకటించాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మను పలువురు రైతులు కోరారు. బుధవారం మండలంలోని వడ్డుపల్లి, తలుపూరు గ్రామాల వద్ద సాగు చేసిన ఆముదం, కంది, వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో డీఏఓ మాట్లాడారు. పంట నష్టపరిహారం విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ప్రత్యామ్నాయ పంట విత్తనాలు రైతులు అందుకోవాలని, మండలంలో 250 క్వింటాళ్ల ఉలవలు ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ కింద సాగు చేసిన ప్రతి పంటను రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రవి, ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తలుపూరు సర్పంచ్ ఓబులేష్,తదితర రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ' ఆడుకుందాం ఆంధ్రా '

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లో అక్టోబర్ 2 నుంచి 'ఆడుకుందాం ఆంధ్రా' క్రీడలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివశంకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువతీయువకులకు సంబధించి 'ఆడుకుందాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. ఈ క్రీడా కార్యక్రమాలకు సంబంధించి క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడలు ఉంటాయని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి గ్రామ సచివాలయాల్లో ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలి

అనంతపురం టవర్‌క్లాక్: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలని ఆలిండియా ఎస్సీ,ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. రవిశంకర్ మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని 15 నుంచి 17 శాతానికి, ఎస్టీల రిజర్వేషన్ శాతాన్ని 6 నుంచి 7 శాతానికి పెంచాలన్నారు. ఇప్పటికే ఎస్సీ, ఎస్టీలు దాదాపు 12 ఏళ్లపాటు రిజర్వేషన్ శాతాన్ని పెంచకపోవడం వల్ల ఉద్యోగావకాశాలు కోల్పోయారన్నారు.

జిల్లాకు 1,728 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు బుధవారం నర్మదా కంపెనీ నుంచి 1,728 మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్ ఏడీఏ ఎం.రవి తెలిపారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లి వ్యాగన్ల ద్వారా వచ్చిన ఎరువులను పరిశీలించారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

అనంతపురం టౌన్: స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ నూతనంగా ప్రవేశపెడుతున్న కార్డు ప్రైమ్ 2.0 సాఫ్ట్‌వేర్‌కు వ్యతిరేకంగా డాక్యుమెంట్ రైటర్లు బుధవారం పెన్‌డౌన్ ప్రకటించి, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. వారు మాట్లాడుతూ స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌లో నూతన సాఫ్ట్‌వేర్ ప్రవేశపెడితే డాక్యుమెంట్ రైటర్లు జీవనోపాధి కోల్పోతారన్నారు. డాక్యుమెంట్ రైటర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి సుధాకర్, జిల్లా నాయకులు నాగార్జునరెడ్డి, నగేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ) కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. అనంతరం డీఆర్ఓ గాయత్రిదేవికి నాయకులు వినతిపత్రం అందజేశారు.

మార్కెట్ కోసం తీసుకొని డెయిరీకి అప్పగిస్తారా?

- పరిహారం ఇవ్వకుండానే పనులెలా ప్రారంభిస్తారు?
- న్యాయం జరిగేవరకూ పోరాటం చేస్తామంటున్న బాధిత రైతులు



మాట్లాడుతున్న రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు

రాప్తాడు: నియోజకవర్గ కేంద్రం సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన (జాకీ కంపెనీకి కేటాయించిన భూమి పక్కనే) ఉన్న భూములను 2016లో టీడీపీ హయాంలో పశువుల మార్కెట్‌కోసమని తీసుకొని, ప్రైవేట్ డెయిరీకి ఎలా అప్పగిస్తారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పూజారి ఓబులయ్య, పూజారి పెద్దన్న, మాళ ఓబుళపతి, రామాంజినేయులు, నారాయణమ్మ, వెంకటరాముడు, మారెప్ప తదితరులు విలేకరులతో మాట్లాడారు. 44వ జాతీయ రహదారి పక్కనే రాప్తాడు పొలంలోని సర్వే నంబర్ 274లో 24 మంది రైతులకు చెందిన 12.70 ఎకరాల భూమిని కాంగ్రెస్ హయాంలో రైతులకు పట్టాలు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తామే సాగులో ఉన్నామన్నారు. గత టీడీపీ హయాంలో మార్కెట్‌ను ఏర్పాటు చేస్తామని మాజీ మంత్రి పరిటాల సునీత పట్టాదారు పాసు పుస్తకాలు, డీ పట్టాలు ఇప్పించుకున్నారన్నారు. పరిహారం ఇస్తామని, ఇప్పటి వరకు పైసా పరిహారం ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం చెరువులోకి హంద్రీ నీవా నీరు వచ్చిందని, పొలాలను సాగు చేద్దామనుకుంటే అధికారులు మా భూమిని గాయత్రి డెయిరీకి అప్పగించారని వాపోయారు. సాగు చేసుకునేందుకు భూమిలోకి వెళ్తుంటే పోలీసులతో బలవంతంగా బయటకు నెట్టిస్తున్నారన్నారు. న్యాయం జరగని పక్షంలో కోర్టును ఆశ్రయిస్తామని రైతులు హెచ్చరించారు.

బాధిత రైతులకు న్యాయం చేయాలి : భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ రాప్తాడు, కనగానపల్లి మండల కన్వీనర్లు జూటూరు శేఖర్, అమర్‌నాథ్ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. పేద రైతుల భూములను రైతుల అంగీకారం లేకుండానే అధికారులు ప్రైవేట్ డెయిరీకి కేటాయించారని, గాయత్రి డెయిరీ నిర్వాహకులు రైతుల పొలాల్లో జేసీబీలతో పనులు చేయించడం సరికాదన్నారు. తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఎమ్మెల్యే అయినప్పటి నుంచి రాప్తాడు చెరువు నాలుగేళ్ల నుంచి మరువ పారుతోందన్నారు. రైతులు తమ భూములను సాగు చేసుకుందామనుకుంటే అధికారులు గాయత్రి డెయిరీకి కేటాయించి రైతుల పొట్టకొట్టారన్నారు.